౪. కథలు

రాధ

'వసంతమూర్తి'

౧

ఆ అమ్మాయిని "రాధా" అని పిలుస్తారందరూ. శరీరచ్ఛాయ నలుపే. అయితేనేం? ఆ కళ్లు! వింతరకమైన వెల్తురు పరిమళిస్తుంది వాటిలోంచి. ఇంక నవ్వో? గవ్వల గిలకరింతే. మా అక్కయ్యతో ఆడుకోడానికి ప్రతిరోజూ ఆమె మాయింటికి వస్తుంది. ఆమెని గురించి నాకు తెలిసిన దింతవరకే.

"నే ననుకున్నకన్న ఆమెకు నన్ను గురించి ఎక్కువ తెలిసి ఉండాలి. కాకపోతే అలాగ ఎందుకంటుంది?...నా భావన గాలిలాగ పరుగెత్తుతోందే? చిన్నతనముచేత ఆమె అన్న మాటల కింత వ్యాఖ్యానమా?" అనుకుంటూ నా గదిలోకి వెళ్లాను. "దాసీదాని కింత చొరవా? సరే. 'మీతమ్ముణ్ణి పెళ్లాడతా' నని ఆమె అన్నదే అనుకుందాం. మా అక్కయ్యకి లేని తొందర దాని కెందుకూ? అబ్బ! ఎంత కేక వేసింది! 'అబ్బాయిగారూ, ఈ అమ్మాయి మీపెళ్లామంటండీ' అంటుందా?" నాకోపము చల్లారలేదు. మరి రెండు చీవాట్లు పెట్టుదామని వెనక్కి తిరిగాను.

"సుధా! ఏమిటిరా, అంత ఎగిరేవు? పాపము, సూరమ్మ ఏడుస్తోంది. అది అన్నమాటలు నిజమో, అబద్ధమో తెలుసుకోకుండా ఊc...చీవాట్లు పెట్టేయడమే?"

"ఏమిటే అంది? నన్ను పెళ్లాడతానందా? లేనిపోని మాటలు కల్పించి—"

"లేనిపోని మాటలా? పోనీ, అడుగు"—"ఏం, రాధా? నిజమేనా? అబద్ధమా?"

"..............................."

"అదిగో చూశావా?"

"నామీద అనుమానము పడుతున్నాడు. ఊరుకుంటావా రాధా?"

"నిజమే."

నీళ్లు చిలకరించగానే అణిగిపోయే పాలపొంగులాగు నా కోపము అణిగిపోయింది. ఏమనాలో తోచిందికాదు. అక్కయ్య పకాలున నవ్వి "ఏం? ఇప్పు డేమంటావు?...సూరమ్మా!" అని కేక వేసింది.

సూరమ్మలో తప్పు లేదు. పెరట్లోకి వెళ్లి దానికోసము వెతికాను. గడ్డిమేటి చాటున నిలబడి కళ్లు ఒత్తుకుంటోంది.

"సూరమ్మా, నీతప్పు లేదు. ఓస్, ఇంతమాత్రానికే యేడవాలా?" అన్నాను. ఏడు పాగలేదు. చెయ్యిపట్టుకు క్రిందికి లాగి-పాపము చిన్నప్పుడు నన్నెత్తుకుని ఆడించేది. పడవలమీద కూర్చోపెట్టేది, మాఅమ్మ వద్దన్నాను. నేను తినమని బలవంతముచేసినా ఏమీ తినడానికి పుచ్చుకునేది కాదు-"అయితే నామోటారు కారులో ఎక్కవన్నమాటే" అన్నాను.

నా చిన్నతనములో ఒకకాపు నన్ను బైసికలు ఎక్కించి తీసుకువెళ్లాడుట. మధ్య దారిలో క్రింద పడ్డాను. దెబ్బ తగిలి రక్తము వచ్చింది. అమ్మ కోపము పడుతుందేమో అని సూరమ్మ ఏడవడ మారంభించింది. తరవాత ఆకాపుతో "నేను పెద్దవాణ్ణయాక కారు కొని దానిలో నిన్నెక్కించి పడతోస్తాను లే" అనీ, తనతోటి "నాకారులో నిన్నెక్కిస్తానులే" అనీ అన్నానని సూరమ్మ చెప్తుతూంటుంది. ఈసందర్భములో చిన్ననాటి మాట జ్ఞాపకము చెయ్యడమే క్షమాపణ కోగడమని ఇలా అన్నాను.

ఓస్! ఏడుపంతా ఎక్కడికో యెగిరిపోయింది. పకాలున నవ్వి "ఏమండీ, అబ్బాయిగారూ! అంత కోప్పడ్డారు?" అంది. ఆ అమ్మాయి అలా అంటుందనుకోలేదు.

జరిగినదానికి వింతపడుతూ వెనక్కి వచ్చాను. హాస్యాలు ఆఖరయినట్లు లేదు. మా అక్కయ్య చావడిలోంచి రావడానికి బయలుదేరింది. రాధ ఆవిడపైట పట్టుకొని వెనక్కి లాగుతోంది.

"అబ్బ! వదలవే పైట లాగేస్తావేమిటి?"

"అడగనంటే వదుల్తాను."

"వదిలీ, అడగనులే."

"సుధా—అ...బ్బ చెయ్యితియ్యి. ఊపిరి సలపడము లేదు. ఏమంటావురా అయితే."

"ఏమిటే అనడము? హాస్యము ఎక్కువైపోతోంది. వాళ్లు నియోగులు; మనం వైదికులం? వాళ్లమ్మ వింటే ఏమంటుంది?"

అక్కయ్య నోరు విప్పగానే రాధ పారిపోయింది

"ఏమంటుంది? ఇంతకన్న మంచినా డెక్కడ దొరుకుతాడంటుంది ఇంకేమంటుంది?" మాట్లాడకుండా నాగదిలోకి వెళ్లిపోయాను. రాధ గభీమని బయటికి దాటేసింది. నాపద్యాలపుస్తక మెవరు తెరిచారూ!

"అక్కయ్యా! నాపుస్తక మెవరూ తీశారు పైకి?"

"నేను" అన్నది రాధ.

"రాధ తీసిందట."

* * * * *

భోజనము చేస్తున్నాము. అమ్మ పప్పులోకి నెయ్యి వడ్డిస్తూ "సూరమ్మ నెవరేనా ఏమిటేనా అన్నారేమిట్రా?"

"ఏం? ఇంకా ఏడుస్తోందా ఏమిటి?"

"ఏమన్నారేమిటి?"

"అలా గడగంపి, అమ్మగారూ" అని నూతిపెగ్గిర్నుంచి సూరమ్మ

"ఏమీ లేదూ. అక్కయ్య రాధని 'రాధా, రాధా ఎవర్ని పెళ్లాడతావే?' అని అడిగిందట తక్షణం ఆవిడగారు సావిత్రిలాగ 'మీతమ్ముణ్ణి పెళ్లాడతా' నందట" పెద్దక్కయ్య నవ్వి చప్పట్లుచరిచింది. అమ్మ "అదేమిటే, శాంతా, అంట్లచేతితోనే!" అంది.

శాంతక్కయ్య నవ్వు మానలేదు. వదినగారి వంతు వచ్చింది. అక్కయ్య చెయ్యి కడుక్కోడానికి ఆవిడచేతిమీద నీళ్లు పోస్తూ "సుధా! మీ రాగనక్కరలేదు చెప్పండి."

సూరమ్మ ఊరంత కేకవేసి కడుపు చెక్కలయేటట్టు నవ్వుతూ "అబ్బాయిగారూ! ఈఅమ్మాయి మీ పెళ్లమండీ" అంది. చిన్నక్కయ్య అందుకుని "నీఅంతరము చూచి మాటాడమన్నారు పెళ్లికొడుకుగారు" అంది. అంతా నవ్వారంభించారు నేను లేచి చెయ్యి కడుక్కుని నుట్టుతిరిగి వీధిచావడిలోకి వచ్చాను. "ఆడినీ సుక్కాని ఈడనే గాడరేసి" అని పాడేసరికి రాధ గుమ్మము దగ్గర కొచ్చి నిలబడింది. వేదతొట్లో లేచి కూర్చుంది "వేదా! లేచావూ!" వేదవతి చిరునవ్వు నవ్వింది. మాటలు రావు గాని లేకపోతే ఏదో ఒకటి అనేదే గభీమని తొట్లోంచి ఎత్తుకుని "పడవెక్కి భద్రాద్రి పోదామా" అని గొంతెత్తాను రాధ నవ్వుతోంది. "రాధా వేదని అక్కయ్య కిచ్చేయి" అన్నాను. ఆమె వస్తూంటే వేద "దా దా" అని చెయ్యి ఊపి, తీరా దగ్గిరికి రానిచ్చి నావీపువైపు తల తిప్పింది. రాధ పకపక నవ్వడ మారంభించింది. అచ్చంగా "సరిగమపధనిస" గవ్వలు గిలకరించినట్లు, మువ్వలు మోగినట్లు, బంగారుగుండ్లు దొర్లించినట్లు. "ఏదీ ఏదీ మరోక్కసారి–" "స రి గ మ ప ధ ని స". ఏదో వింత అందముంది ఆగొంతులో. కోయిలస్వరము కాదు, నెమలి కంఠముకాదు, తుమ్మెదరొదకాదు. వీటి నన్నిటిని మింగి నెమరువేస్తున్నట్లుంది. గోడకి చేరబడి రాధ ఒక చిరునవ్వు విస్మయము తోటి ఆమె వైపు చూచాను. కలువపువ్వుల అమాయకత్వము ఆముఖములో నురుగుకట్టింది. ఉమాకాంతులా నల్లని నుదురుమీద నృత్యము చేశాయి నక్షత్రా లాకళ్లల్లో గంతులు వేస్తున్నాయి. నాగస్వరానికి సర్పములాగు క్షణకాలము ముగ్ధుణయాను. వీధిలోంచి ఉరుములాగ నాన్న మాటలు వినబడ్డాయి గభీమని ఆమెచేతులు పట్టుకు లేవదీసి "ఊఁ, వే ని తీసుకుపో త్వరగా!" అన్నాను.

౨

మధ్యాహ్నము అమ్మ పడుకుని నిద్రపోయింది. గదిలో కూర్చుని 'కృష్ణపక్షము' చదువుతున్నాను. ఎండ తెరలు తెరలుగా భూమి నావరిస్తోంది. చంద్రకాంతం మొక్క ఆకులు వేలవేసింది. చిన్న పిట్ట ఒకటి రెమ్మలమధ్య వాలి ఏదో పొడుచుకు తింటోంది. అక్కయ్య చావడిలోంచి "సుధా" అని పిల్చింది. వెళ్లి, "ఏం?"

"చెప్పు రాధా."

"మరేమోనే, మీ అక్కయ్య పిక్క ఒకటి నాదగ్గి రుంది. ఇప్పుడావిడ చెమ్మవేశారు. ఆవిడ తన పిక్కని బతికించుకోకుండా నాపిక్కని చంపవచ్చునా?"

"గవ్వ లాడుతున్నారా? మరేం పని లేదా యేమిటి?"

"ఏం చెయ్యమన్నావు?"

"చదువరాదూ, ఏదేనా పుస్తకం?"

"ఆఁ! పుస్తక మనగానే జ్ఞాపకము వచ్చింది. ఏది, సుధా, యెంకిపాటల పుస్తక మియ్యి."

"నేను పట్టుకురానా?"

"ఊఁ వెళ్లు" రాధ ఒక్క పరుగున వెళ్లింది. అక్కయ్య "అబ్బ! చంపేస్తోందిరా!"

"ఏమిటే?"

"ఆపాటలు పాడమని నిన్నడగమని చంపేస్తోంది. ఆఁ నువ్వే అడగమన్నావు. అడగకుట అన్నం తింటున్నా, నీళ్లు తాగుతున్నా, పూలు కట్టుతున్నా, 'ఏమండీ! అడగరూ' అని పీకేస్తోంది."

"ఎప్పుడు వింది?"

"రోజూ వింటోంది."

పుస్తకం పట్టుకుని రాధ వస్తోంది ఈ పిల్ల చర్య కొంత వింత గొల్పింది.

"ఏ పాట పాడమన్నావూ?"

"రాధ నడుకు.—ఏది రాధా?"

"బాగుంది. నేను పాడమన్నా నా ఏమిటి?"

"అయితే పుస్తకము సొరుగులో పెట్టేయి."

"ఊఁ."

అంటూ పుస్తకమందించింది వేళ్లు తగిలి రక్త ముద్రిక్తమైంది. ఆ మెబుగ్గలకి రక్తము చింబింది. ఆ కళ్లు ఎందుచేతనో చూడలేకపోయాను గుండె గాలికి రావిఆకులాగ కొట్టుకుంది. చెయ్యి వణికింది. పుస్తకం జారింది.

"అదేమిట్రా పాడవూ?"

"పోనిస్తూ."

"అయితే పుస్తకం ఎందుకు తెమ్మన్నావు?"

"నువ్వా? నేనా?"

"ఎవరో. పాడుదూ."

"ఆడనీ సుకాన్ని ఈడనే గడయేసి.

...."

"ఊఁ ఇంకోటి. ఏదీ పుస్తక మిలా ఇయ్యి......ఇదిగో."

"అబ్బే యిది కాదండీ. నేను చూపిస్తా.....ఇదిగో యిది."

"ఇయ్యి."

"అబ్బ. మీ రిద్దురూ!"

"యెంకి వొంటి పిల్ల లేదోయి లేదోయి,
యెంకి నావొం కింకరాదోయి రాదోయి"

"అమ్మ రాధా, గడుసుదానవే!"

"ఏం?"

"ఏం లేదు. పాట కానీ."

"చెక్కిట చిన్ని మచ్చ, చెపితే చాలదు లచ్చ"

అక్కయ్య పకాలున నవ్వి, "అమ్మ రాధోయి, ఇంత గడుసు దాని వనుకోలేదే...అమ్మోయి! రాధే...." అంటూ లోపలికి వెళ్లబోయింది. రాధ ఆవిడ పైట పట్టుకుని "అబ్బ, ఇప్పుడే పడుకున్నారండీ. లేపకండీ" అని అడ్డపడింది.

అక్కయ్య వెనక్కి వచ్చి, "ఏదీ సుధా! తక్కినదికూడా కడతేరా పాడు. ఇంకా ఏముందో చూదాము."

"పాడను. ఏమన్నావు. రాధగడుసుతన మేముం దిక్కడ?"

"...(నవ్వు)...ఏది రాధా నీమచ్చ ఏదీ?" అంటూ రాధ బుగ్గ నా వైపు తిప్పబోయింది

"అ...బ్బ."

"ఇదిగో సుధా, రాధ చెక్కిటి చిన్నిమచ్చ."

రాధ అక్కయ్యనోరు మూసేసింది.

ఈ అమ్మాయి అమ్మాయిలాగ లేదు.

3

ఒంటిగంటకి బళ్లు పూయించాడు పయిడయ్య అంతా బళ్లలో కెక్కుతున్నారు పల్లకీ రాలేదు సొమ్ము పుచ్చుకునికూడా సమయానికి రాలేదని అమ్మకి చాలా కోపముగా నుంది.

"బ్రహ్మం, వెళ్లు."

"ఊఁ...అదుగో."

పల్లకీ వచ్చింది. అన్నయ్య కూర్చున్నాడు. అత్తా, దొడ్డమ్మ, పిన్ని అక్కతలు జల్లారు. బాజాలు మోగుతున్నాయి. అమ్మ పెద్దక్కయ్య కేదో చెప్పింది. ఆవిడ రాధ ఇంటికి వెళ్లి చిన్నక్కయ్యనీ, రాధనీ తీసుకు వచ్చింది. చిన్నక్కయ్య ఒక బండీలో కూర్చుంది. కాని రాధకి చోటు లేకపోయింది. "మాబండీలో కొంచెం చోటుంది ఇక్కడికి పంపండి" అని మా అప్పలన్నయ్య కేకవేశాడు. రాధ వచ్చింది. నేను చెయ్యి అందించాను. పట్టుకుని పైకెక్కింది.

"ఫిడేలెవరిది?"

"నాదే."

"ఎన్నాళ్లాయి నేర్చుకుంటున్నావు?"

"రెండేళ్లనుంచి."

"ఇంకేం, గానపాటకు లెవ్వరూ అక్కర లేదన్నమాటే."

రాధ నవ్వింది. "ఏదేది? మళ్లీ." అన్నాడు, అప్పలన్నయ్య.

"ఊరుకో ఊరుకో. ఊపిరి సలపదు."

ఏదో విపరీతభావము గాలి తెరలుగా వచ్చి నా హృదయాన్ని కమ్ముకున్నది. విరామము లేకుండా వాసనలు గుప్పే సుగంధ రాజకుసుమంలాగు, ఆయాసపడకుండా మెరిసిపోయే నక్షత్రంలాగు రాధ నవ్వడ మారంభించింది. నూటికి ముగ్గురున్న బ్రాహ్మలలో ఇన్ని శాఖ లెవ

ఠేర్పరిచారా అనే ఆలోచనలో పడవలసేవుకి బట్లు వచ్చాయన్నమాట మరచిపోయాను.

౪

మా విడిదికి మేడ ఉంది. నేనూ, అప్పల నరసింహం అన్నయ్యా, మా తమ్ముడూ కూర్చుని తమలపాకులు వేసుకుంటున్నాము.

"తమ్ముడూ, ఒక పద్యం చదువూ."

"పద్యం కాదు. పాట పాడతాను. విను"

"ఏదో ఒకటి."

"యెంకి వొంటిపిల్ల లేదోయి లేదోయి"

"..........................."

"ఒక్క నవ్వే చాలు వొజ్జిర వైడూరాలు"

అన్నట్టు నవ్వన గానే జ్ఞాపకము వచ్చింది. "ఆపిల్ల ఏదీ? ఏం పేరు?"

"రాధ."

"రాధా?"

"ఆఁ."

"మాట మాట."

"తమ్ముడూ, పాటకానీ."

పాడక పోడానికి కారణము లేదు. పాడితే అనుమానము పడతాడేమో. అన్నట్టు ఇతని కాసంగతి తెలీదు.

ఆమె మెట్లెక్కుతున్న చప్పుడవుతుంది.

"చెక్కిట చిన్ని మచ్చ
చెపితే చాలదు లచ్చ
ఒక్క నవ్వే యేలు వొజ్జిరవైడూరాలు"

రాధ వచ్చింది. అప్పలన్నయ్య ఆమెకేసి తిరిగి "ఒక్కనవ్వే యేలు వొజ్జిరవైడూరాలు" అన్నాడు. రాధ ఈమారు నవ్వలేదు. దృష్టి పాటమీద ఉన్నది.

"మెళ్లో పూసలపేరు తల్లో పూవులపేరు"

"అబ్బే. అలాకాదురా; మెళ్లో ముత్యాలపేరు—తరువాతి యేమిటో"

రాధ మెళ్లో ముత్యాలపేరుంది. నా కళ్లామెవైపు తిరిగాయి. ఆనాటి 'మచ్చ' మాట జ్ఞాపకమువచ్చి "చెక్కిట చిన్నిమచ్చ" కూడా ఉంది. "అదికూడా పాడవోయి" అన్నాను. రాధ సిగ్గుచేత తలవంచేసింది. పాట ఆరంభిద్దామని గొంతుసవరించి,

"రాసోరింటికైన రంగూ తెచ్చేపిల్ల
నాసామ్మి నాసుండె నమిలీ మింగినపిల్ల"

"వణుకుతావేం?"

"గొంతుకులో ఏదో అడ్డుపడింది. వస్తా" నంటూ వరండా లోనికి వెళ్లాను. క్రింద నుంచి "సుధా!"

"ఆఁ"

"రాధేదీ?"

"ఇక్కడుంది."

"ఇలా రమ్మను."

"రాధా! అక్కయ్య పిలుస్తోంది."

నేను తిరిగి వచ్చి, "నియోగులికీ, వైదీకులికీ తేడా ఏమిటన్నయ్యా?"

"వాళ్లు—కర్మలకి పనికిరారు!"

"మనం? —ఉద్యోగాలికా!"

"ఎక్కడికిలే, అసలు తేడా లేమీ లేవు. అనుకుంటే తేడాలెన్నైనా వస్తాయి."

"పురోహితుణ్ణడుగుదామా?"

"ఊఁ. పిలవరా చంద్రశేఖరం."

"వద్దు. వద్దుండు. నేను రప్పిస్తాను.

"నిండార బాలు నఖండగోదావరి
దాగిన చాళుక్యనాగరికత"

"ఎక్కడ నేర్చావురోయి ఈఘక్కి. వెంకటశాస్త్రిగారిదిలాగుందే. కానీ."

"పల్లెపదాల జీవము నిల్పికొన్న ప
ల్నాటివీరుల రక్తనాళపటిమ"

"శేష్. బాగుంది. రాధా. ఇలా రా. మూలనక్కావేం?"

పురోహితుడూ, శాస్త్రిలు గారూ, పినతండ్రిగారూ వచ్చారు.

"ఏమండోయి శాస్త్రిలుగారు, బ్రహ్మగారు ఇలా వచ్చారు?"

"ఇదిగో మనవాడి పద్యాలు విందామనే."

"పద్యాలు వినడం కంటె పెద్దపనికే రప్పించాడు మిమ్మల్ని, పద్యాలు చదివి."

"ఏమిటి కథ?"

"నియోగులికీ మనకీ సంబంధా లెందుకు లేవు?"

"ఆచారం లేదు."

"అధికారగర్వం ఉంది వాళ్లకి, ఆచారాల గర్వం మనకి."

"సరి. ఏకోతీకొండదిగదు."

"పెళ్లి సంబంధాలవల్ల ఈరెండు భాగాలూ కలిసిపోతే నూటికి ముగ్గురున్న బ్రాహ్మల గతి ఇప్పటికంటె బాగుపడమూ?"

"పిల్లికి గంటకట్టేవా రెవరూ?"

"ఇది పిల్లిటండీ?"

"మీ ళ్లివ్వరు, వా ళ్లివ్వరు. మరి పె ళ్లెలాగ అవడం?"

"మాటవరస కంటున్నాను. నా కివ్వడాని కెవరేనా సిద్ధపడతా రనుకోండి. మీరు పెళ్లిచేయిస్తారా?"

"ఏ మంత అవసరము, వాళ్ల పిల్లని చేసుకోడానికి?"

"చూశారా? ఆప్రశ్న రావలసిన అవసర మేమిటనే నే నడిగేది."

"పోనిస్తూ. దానికేం గాని ఒకపద్యం చదవరా?"

"చదవ్వోయి. చూద్దాం, వాటిమాటకేం?"

"నడిలేని నడురాత్రి నడురాజు గిల్గింత
కడరి యుప్పొంగెడి కలువనవ్వు.
వగరౌ చిగురు మెక్కి పొగులు కోవెలగొంతు
బిగుతౌట కలరు జాబిల్లి నవ్వు
వేళ్య జూడగ బోవ వెలికిదీయుచు నూరు
జడు బొడగాంచు వజ్రంపు నవ్వు—"

"భేష్, ఎవర్రా వ్రాశారూ?"

"అర్జునా ఫల్గునా యనుచు కేకలవైచు
బాలుర గాంచు మేఘాల నవ్వు
కలసి యానందరసవర్షములను గురిసి
మోడుబోయిన నాగుండె మొలక లేసి
కిసలయావృతగా జేసె కీరవాణి
ఏది వినిపింపు నీ నవ్వు నికొక సారి"

"ఏది? ఆ ఉయ్యాలపద్యం చదువు!"

"ఏలాలతాజాల డోలాసమాలోల
బాలామణీగాన భాసురములు"

ఏలాల......మొదటి, రెండు, మూడు కాలములలో చేతిని ఉయ్యాలతీరుని ఊపుతూ చదివాను. చె య్యూపుతూంటే రాధ నవ్వింది. "గ్రామఫోన్ ప్లేట్" అన్నాడు అప్పలన్నయ్య. మా పినతండ్రి "ఊఁ. బాగానే ఉంది కథ!" అన్నాడు. నాగుండెలో రాయి పడింది.

"బ్రహ్మగారూ, కబురు వచ్చింది. రావాలి" అని అన్నయ్య వచ్చి పిల్చాడు. పినతండ్రి గారు, రాధ మాత్రమే ఉన్నారు.

"ఏదీ, సుధా! ఏమి టాపాదం?-వగ రా?"

"వగరౌ చిగురు మెక్కి పొగులు కోవెలగొంతు
బిగుతౌటకలరు జాబిల్లినవ్వు"

"అబ్బే—మార్చాలి ఈపాదం. వ్రాసుకో."

"నేను వ్రాస్తేగా?"

"నాదగ్గర బొంకకు మరి! ఈపిల్ల నిమ్మోగుల పిల్లా ఏమిటి?" దొరికి పోయాను. "ఊఁ."

"అనుకున్నదే. ఊఁ."

"నికటస్థమూ పెంటి నెరుగక మొరలిడు
చక్రవాకము గాంచు చంద్రు నవ్వు"
అని వ్రాయి......అదేమిటి ఆబాజాలు?"

"భోజనానికి వెళ్లుతున్నారు."

"నువ్వు రావూ?"

"మేము చద్దన్నము తిన్నాము."

"సరే. నే వెళ్లాలి మరి." అని ఆయన లేచి వెళ్లిపోయారు. ఏదో పెద్దబరువు గుండెలమీదనుంచి లేచిపోయింది.

"రాధా! నీఫిడేలేదీ?"

"అదుగో."

నేను వెళ్లి తెచ్చి, "ఊఁ. వాయించు."

"అబ్బ, ఇప్పు డేమిటి?"

"ఇప్పుడే మరి. ఎవరూ లేరు. చాలా బాగా వాయించాలి మరి."

"సా......"

"ఊఁ. ఎవరేనా వస్తారు మరి!"

"సారినీదా—పీ రి బో ణి......"

"భేష్. ఎవరిదగ్గర నేర్చుకుంటున్నావు? ...... ఏమిటది ఉంశుండు. సాలీడు. నేను దులిపేస్తాను." అని ఆమె ముంగురులమీది సాలీడు దులిపాను. ఆమె కదలలేదు.

"ఇంకొకటి."

"స్వరరాగసుధారస......"

"ఊఁ. ఇదొకటా నీనవ్వుకి తోడూ? అవునుగాని అన్నట్లు నీపె ళ్లెప్పుడు?"

"ఊఁ."

"చెప్పమ్మా, సిగ్గులకేమి ?" అంటూ అప్రయత్నముగా నామె చెయ్యి పట్టుకున్నాను. ఆమె తీసికో యత్నించలేదు.

"మీ పెళ్లో ?"

"......... అవుసుగాని, ఎవర్ని పెళ్లాడతావని మా అక్కయ్య అడిగితే ఏమీ ఆలోచించకుండా 'మీతమ్ముణ్ణి పెళ్లాడతా' వంటావా ?"

"ఎమిటి ఆలోచించడము ?"

"మీరు నియోగులు, మేము వైదికులం."

"అయితే ?"

"మీకూ మాకూ సంబంధా ల్లేవే............అయినా ఏమి చూచి పెళ్లాడతా నన్నావు ? అందమా ? ఏకో శాన్నా లేదే ?"

"ఎవ రన్నారూ ?"

"అద్దం. ఎవ రనాలి. చిన్నప్పుడు కాల్చిన చుట్టమచ్చ నుదురు మీ దుంటే అదీ.........వరో సంగతి. నువ్వూ నేనూ ఒప్పుకుంటే సరిపోతుందా ? మీ అమ్మో ?"

"అమ్మ ఏమనదు."

"చిన్నతనము నీకు. ఇదేం బజాగునుంచి మిఠాయి తేవడ మనుకున్నావా ? మీఅమ్మ కిష్టమే అనుకో. మీ మామయ్య, పిన్ని, మీఅత్త, అమ్మమ్మ, వీరంతా నిన్ను నా కివ్వనిస్తారా ? 'వైదీకపాడికి మన పిల్ల నివ్వడమేమి' టనరూ ? చిన్నపిల్లవి. నీ కీసంగతులు తెలియవు. ఏ మంటావు ?"

రాధ మెల్లిగా నాచేతిలోని చేయ్యి తీసేసుకుంది. నా మనస్సులో తుపాను బయలు దేరింది.

"ఏ మంటావు ? నిజమా ? అబద్ధమా ?" అని తలమీద చెయ్యి వేసి ముఖము పైకి ఎత్తాను.

"నిజమే" అని ఆమె తలవంచేసి ఫిడేలు తీగని బిగుతుచేసి వదులు చేస్తోంది. కుడిచేతిలోని ఫిడేలుకఱ్ఱ తీగలమీద గంతులు వేస్తోంది.

తూ. తుత్తు తుత్తుత్తూ......

"తూతూపాకా. వాళ్లు వస్తారు. వెళ్లు. ఫిడేలు నేను సర్దుతా లే." ఆమె లేచింది. రెండు నీటిచుక్కలు నాచేతి మీద పడ్డాయి.

ఎవర్నేమి టనడము ? ప్రాచీనాచారమనే మత్తగజము ఆచారవంతులవీథులలో విచ్చలవిడిగా విహరిస్తుంది. దాని కెవరేనా అడ్డు వెళ్లితే దాని కాలిక్రింద పడి నలిగిపోవలసినదే ! ఆచారదౌర్జన్యము వారికి రోహిణికార్తి ఎండవలె కనబడితేనే కాని ఏవిధమైన మార్పూ అవసరమని యెంచేవాళ్లే ఉండరు. రాధాసుధాకరులు ఆ నలిగినవాళ్లలో ఇద్దరు.

* * * * * *

రాత్రి. పడవలు మెల్లగా సాగుతూన్నట్లు పిల్లినకఱ్ఱకి కట్టిన మువ్వలు చెప్తున్నాయి. గట్టుమీది చెట్లు నాదాకా వచ్చి కొంచె మాగి, నన్ను చూచేకాబోలు గుసగుసలాడుకుంటూ కదలిపోతున్నాయి. పాపము వీటిగ తేమిటి ? పుట్టిన దగ్గిర్నుంచి చచ్చేదాకా ఒకేచోటున పడి ఉండాలి. నక్షత్రాలు కునికిపాట్లు పడుతున్నాయి. వాటికీ ఎదుగే లేదు. ప్రపంచము, ఎందరో అనేటట్లు విశ్రాంతిగృహము కాదు. గాలిరాకకి వెదురుపొదలు సంగీత మారంభిస్తే నన్ను పొంద లేరని చెప్పేసి వెళ్లిపోతున్నాడు మందపవనుడు.

"పడవ ఒడ్డుకి పెట్టవోయి."

"ఎవరు ?" అని బయటికి చూచాను. బాబు, ఇంకా ఎవరో. అక్కయ్య "సుధా"

"ఆc."

"ఇలా రా." వెళ్లాను.

"రాధకి ఏమిటో కావాలిట. కొని పెట్టు."

"ఏం కావాలి ?"

"దాహం వేస్తోంది."

కొంతదూరం వెళ్లాము.

"సోడా తాగుతావా ?"

"అబ్బే ఛీ !"

"మజ్జిగో ?"

"ఊc."

దూరంగా దీపం మినుకు మినుకు మంటోంది. దగ్గరకి వెళ్లాము. దీపంలాగే కునికిపాట్లు పడుతోంది గొల్ల మనిషి.

"మజ్జి గుందా ?"

"ఆc. ఎంతటిది ?"

"ఒక అర్ధణా దియ్యి. రాధా, నీ కెంతది కావాలి. చూడిది."

"మీరు తాగండి చెప్తాను."

నేను తాగి "అబ్బో" అన్నాను. రాధ "ఏదీ. ఎంత మిగిల్చారేమిటి ?" అని నా చేతిలోని పిడత తాను తీసుకుని తాగడ మారంభించింది. పిడత తీసుకోబోతే వదలలేదు.

"అదేమిటి రాధా !"

"ఏం ?"

"నేను ఎంగిలి చేసినది తాగుతావా?"

"ఏం తాగితే........అదుగో పడవ మళ్లా ఒడ్డు కొచ్చేసింది. రండి. వెళదాము." పరుగులో ఆమె జారింది. నేను పట్టుకుని ఆమెతల రొమ్ము కదుముకున్నాను. పడమటి మేఘాలు పక్కున నవ్వాయి.

*　　*　　*　　*

౨

మునపటిపలె రాధ మాయింటికి రావడములేదు. ఎందుచేతనో తెలియలేదు.

"అక్కయ్యా, రాధ రావడము మానేసిందేం?" అక్కయ్య అమ్మకేసి చూచింది.

"ఏం రాకపోతే? ఎప్పుడూ నీపాటలు వింటూ కూర్చోమన్నావేమిటి? వాళ్లమ్మకి జ్వరమట."

"ఊహుఁ."

*　　*　　*　　*

"కాఫీపొడుము పట్టుకురాగలరా ఎక్కడేనా, మీబావగారికి టీ పడదట?"

"రాధగారింట్లో ఉంటుందేమో!"

"రాధ యింట్లోనా? మీఅమ్మ ఏమంటారో?"

"ఏమి? అడగకూడదూ?"

"పోనీ పట్టుకురండి. మీఅమ్మతో చెప్పకండి. వీళ్లనీ, వాళ్లనీ ఎందుకు అడగడ మంటారు."

బయలుదేరాను. కాని "మీఅమ్మ ఏమంటారో" అన్నమాట చెవులలోను, గుండెమీదా రింగుమంది. రాధ నడగడము అమ్మ కిష్టము లేదూ? వారింటికి వెళ్లి "రాధా"

"ఆఁ." అంటూ బయటికి వచ్చింది.

"కాఫీపొడు ముందా?"

"ఊఁ." అని వెళ్లి పట్టుకొచ్చింది.

"రావడము మానేశావేమి?"

"అమ్మ కొప్పడుతోంది."

"మీఅమ్మ కెలా గుంది?"

"ఏం?"

"జ్వరమట."

"అబ్బే, లేదే! ఎవ రన్నారూ?"

*　　*　　*　　*

"అమ్మా, రాధకి శారదాబిల్లు రాకుండా పెళ్లి చేసే యత్నంలో లేరేమిటి?"

"లేకేమి? యెదిగారా ఎవరూ దొరకకపోతే మన సుధని కట్ట మంటుందట వాళ్లమ్మ, మంగళసూత్రం."

నా వళ్లు జల్లుమంది. ములిగేవాడికి కట్టెపుల్లలాగు నిరాశలో ఈఆశ యేమిటి?

*　　*　　*　　*

"అమ్మా, రాధకి పెళ్లివారొచ్చారు. పుత్రవాడు తెల్లగా బాగున్నాడు."

"వాళ్ల యింటిపే రేమిటి?"

"ఎందుకురా నీకు వాళ్లగొడవలు, నీచదువేదో చూసుకోక?"

"ఏం, అడిగితేను?"

"అబ్బే! తెలియదురా!"

"ఏమమ్మా అడిగితే?" నా కళ్లుమండాయి గోరుచుట్టుమీద రోకటిపోటు.

*　　*　　*　　*

పఠనమందిరములో పేపరు చదువుతున్నాను. రాధఅన్నయ్య శుభలేఖ ఇచ్చాడు. లోకమంతా ఊపిరిబిగబట్టింది. "నీరాధని ఇంకొకని కిచ్చేస్తున్నారోయి" అంటూ కవరుమీది బొమ్మ ఎర్రనవ్వు నవ్వింది. ఏదో మాట్లాడబోయాను. మాట రాలేదు. దగ్గబోతూ బయటికి వచ్చేశాను. ఇంటి కెళ్లి "అక్కయ్యా! రాధకి పెళ్లిగాబోలు. ఇదిగో శుభలేఖ. వాళ్లన్నయ్య ఇచ్చాడు."

"కాబోలంటున్నావు. చూడలేదేమిటి?"

"ఎందుకు చూడడం? లేదు."

*　　*　　*　　*

"ఇవాళ రాధపెళ్లిట."

"అయితే?"

"మీరు వెళ్లరూ?"

"ఊహుఁ. పిలిస్తేనా?"

"భేష్. ఈనాటకం బాగుంది. ఏమనుకున్నారో?"

*　　*　　*　　*

సాయంకాలము. పెళ్లివారింట్లో బాజాలు మోగుతున్నాయి. అప్రయత్నంగా ఆవైపు వెళ్లాను.

రాధ పసుపుబట్టలు కట్టుకుని అరుగుమీద నిలబడి ఉంది. ఆగిపోయా.

"అదిగో రాధ. మరొకడి సొత్తయిపోయింది. అయితే నాకేమీ కాదన్నమాటే ఆఅభిమానం, ఆపాటలు, నవ్వులు సృష్టికర్తకి గచ్ఛకాయలే? అంత ఆకర్షణకి కారణం ఏమీ లేదూ? ఈమె నాకేమీ కాదూ, నే నీమె కేమీ కానూ?"

"అన్నయ్యా! ఎవరూ భోజనానికి రాలేదేం?" ఒళ్లంతా గగుర్పొడిచింది. ఈమె నాకు చెల్లెలా? నేను పొరపాటుగా ఎంచి బాధపడ్డాను. "చెప్తాన్లే". లేకపోతే ఆస్నేహాని కర్థమేమిటి? ఈమె నాకు చెల్లెలే.

౬

పెళ్లయిపోయిన దగ్గర్నుంచి రాధ మాయింటికి రావడము మొదలుపెట్టింది. ఇంక భయము లేదుకదా అని కాబోలు వాళ్లమ్మ కాని, మాఅమ్మకాని ఈరావడాని కభ్యంతరపెట్టలేదు. తెర కాస్తా బలిసింది. కాబట్టి "ఏది రాధా, ఏదీ నీనవ్వు" అని నేనన్నా. "అన్నయ్యా! ఈపాట పాడు"మని ఆమె అన్నా తప్పించేవా రెవరూ లేరు. ఆమెకూ నాకూ ఉన్న—తప్ప మిగిలిన వన్నీ ఉన్నాయి, ఈ పరిచయస్నేహాలలో.

రాధవివాహ మయింది, నీవివాహము మాటేమి టంటారు పాఠకులు. అవనిగడ్డనుంచి ఒకసంబంధము వచ్చింది. నా కెందుచేతనో వివాహమంటే వైముఖ్యం పోలేదు. మనుపు, ఆమె ఉన్నది కనక, ఇప్పుడో ఆమె దాటిపోయింది కనకేమో? ఈసంగతి మావాళ్లకి తెలీయదు. ఈసంబంధము చూచి రమ్మన్నారు. పిల్లకళ్లలో తేజస్సు లేదు. నవ్వితే ఏడ్చినట్లు లేదుకాని అ దెలాగో ఉన్నది. సంగీతములో 'మ' 'ప' 'ధ' లకి తేడా లేదు ఉచ్చారణలో. పిల్లమాత్రం సఫేదు రంగు, అద్దాలబిళ్లకి పాదరసం పూసినట్టు. నల్లగా ఉంది. తెలివి తేటలు లేవు. మొద్దుమొహం అని చెప్పి తోశేశాను. శారదాబిల్లు ప్రాచీనాచారవంతుల కోలాహలముతో, పెళ్లిబాజాలతో, గుర్రపు బండీ పల్లకీలతో ప్రవేశించింది. సంబంధాల అలజడి చాలామట్టుకు తగ్గింది. మావాళ్లకీ రహస్యంగా పెళ్లిచేయుడ మిష్టములేదు. ఇదీ నయమే ననిపించింది.

పరశాఖలోని పిల్లనే వివాహమాడతానని చాలామార్లు ఇంట్లో అంటూ వచ్చాను.

"బిల్లు ఒకటి అవతరించిందిగా? ఇంక ఏపిల్లయితేనేం?" అనేది మాఅమ్మ. ఈలోపుగా మాఅక్కయ్య నేస్తురాలి కొకర్తెకి (వారు ములికినాడువారు) కూతు రున్నదట. చేసుకోవలసినదని ఆమె మాఅక్కయ్యకి వ్రాసింది. మాఅమ్మకి వైశాఖసంబంధము లిష్టములేక పోయినా ఆపిల్లనైతే ఒప్పుకుంటా నంది. నేను 'పిల్లని చూడనక్కర లేదు. మన మెరిగిన పిల్లేకదూ?' అన్నాను. రాధ కాకపోయిన తర్వాత నింకేపిల్లయితేనేం?

* * * *

నా కిష్టానన్న పిల్లలందరి భోగట్టాలూ రాధా కనుక్కునేది. ఈపిల్లసంగతి ఆమెకు తెలియదేమో. ఒకనాడు మాఅక్కయ్య ప్రసంగవశాత్తు, "బందరెళ్లేటప్పుడు" అంది.

"బందరా! మీ కెందుకు బందరూ?" అంది రాధ.

"మాతమ్ముడికి పెళ్లికి."

"ఏమిటే! కుదిరిందా ఏమిటి?"

"ఆఁ."

"వాళ్లింటిపేరు?"

"హిందూపురంవారు."

"అదేం పేరు? వెలినాట్లే?"

"కాదు. 'మాశాఖవాళ్ల పిల్లని చేసుకోను, వైశాఖులలోనేగాని' అని వాడు పట్టుబట్టాడు. అందుకని వైశాఖపిల్లని చూశాము. నీళ్లు జల్లితే పాలపొంగులాగ అణిగిపోయింది, ఆమె ఉత్సాహము.

"అయితే ఎప్పుడు బయలుదేరుతారు?"

"మాఘమాసంలో."

* * * *

శాఖాభేదాలు మాసిపోవాలని సంఘంలో కల్లోలం పుట్టిద్దామని నాఆశయం. చేసిచూపిన తర్వాత ఆరంభిద్దామని ఊరుకున్నాను. మళ్లీ ఏమొచ్చిందో రాధ మాయింటికి రావడము మాని వేసింది. ఏమిటిరా విశేషమని కనుక్కుంటే ఆమె వ్యక్తురా లయినట్లు తెలిసింది. కాని పాపం వంట్లో బాగుండక బాధపడుతూ చిరాకుగా నుంటుందట. ఒకనాడు మందుకి డాక్టరుగారింటికి వెళ్లాలని వాళ్లమ్మ మాఅమ్మతో చెప్పింది.

"సుధా! వాళ్లమ్మాయికి వంట్లో నయములేదుట. వాళ్లబ్బాయి ఊళ్లో లేడుట. వెళ్లి మందుకు తెచ్చిపెట్టరా పాపం!" అంది మాఅమ్మ. మందు తీసుకుని వాళ్లింటికెళ్లి "పిన్నిగారూ" అని కేక వేశాను.

"రండి" అని ధ్వని.

లోపలికి వెళ్లాను. మంచముమీద ఆమె పడుక్కుంది. కూర్చోమని మంచంపట్టెమీద కొట్టింది.

"బందరు ఎప్పుడు వెళ్లతారు?"

"నీ కెవరు చెప్పారు?"

"మీ అక్కయ్య."

"నువ్వు వస్తావా?"

ఎందుచేతనో నావైపే చూస్తున్న ఆకళ్లలో జలజల నీరు క్రమ్మింది. ఆనీళ్లు నాకు కనబడకూడదని గాబోలు తల పక్కకి త్రిప్పింది.

"ఏం రాధా?"

"............. .."

"ఎందు కేడుపు?"

వంటవసారాతలుపు గాబోలు కిర్రుమంది. గభీమని కళ్లు తుడుచుకుని,

"ఏం లేదు. దూరంగా నిలబడండి. అమ్మ వస్తోంది."

"పిన్నిగారూ!"

"వస్తున్నా నాయనా! కూర్చో. ఎంతో ఆలస్యము లేదు."

"మం దివ్వనా రాధా?"

"మందా, ఎందుకు? రోగానికా, యోగానికా?"

నా కామెమాటలు వింతగొల్పాయి. చికాకెత్తింది. మందక్కడ పెట్టి, "రెండింటికీ మం దెవ రివ్వగలరమ్మా? ఇప్పుడే వస్తానుండు" అని వచ్చేశాను.

ముహూర్తము సమీపస్థమౌతున్నకొద్దీ నాఉత్సాహ మెక్కువౌతోంది. ఎవరో కోతిని కట్టుకుంటాను. ఇకముందు రాధాసుధాకరులకి శాఖ లడ్డురాకూడదు.

శుభలేఖలకి పైవిలాసాలు వ్రాస్తున్నాను. రాఘవన్నయ్య వచ్చి పిలిచాడు. వెళ్లాను. "మాయింటికి ఒకసారి రండి. మాచెల్లి తీసుకురమ్మంది." అన్నాడు. ఎందుకో? వెళ్లాము.

మంచముమీద ఆమె అలాగే ఉంది. గది చీకటిగా నుంది. నడికప్పులోంచి సూర్యకిరణ మొకటి గదిలో దూరి కొంచెము వెలుతు రిచ్చింది. రాధ కూర్చోమని సైగచేసింది. ఎక్కడా కుర్చీ లేదు. దగ్గిరికి వెళ్లి నిలబడ్డాను. కూర్చోమని మళ్లీ సైగచేసి, "మ రెప్పుడూ కూర్చోమనను లెండి" అంది. నాకడుపు చెరువై పోయింది. ఎందుచేతనో పాతవిషయాలన్నీ గుండెని కమ్మాయి. అనలేక అనలేక "ఏం చెల్లెమ్మా!" అన్నాను. రాధ మూతిమీద చెయ్యిపెట్టుకుని కూర్చోమంది మూడోసారి. "కూర్చో నాయనా, నామూలాన్నుంచే వచ్చిం దింతాను. అప్పు డిచ్చేస్తే ఏబెంగా లేకపోవును." అన్నాదావిడ, కళ్లు వత్తుకుంటూ. ఝంఝామారుతానికి అరటిచెట్టులాగ కొట్టుకుంది మనస్సు. రాధపక్కన కూర్చున్నాను. ఆమె నాచుట్టూ అరసున్నలాగు పడుకుని నన్ను ఒత్తింది. తల మంచపట్టెమీద పెట్టి, చేతులు నాకాళ్లమీద వేసింది. ఒళ్లు గప్పుమంది. ముత్యాల్లాగ కన్నీరు రాలుతోంది. తుడవడానికి ధైర్యము చాలలేదు. పక్కమీది పగడాలపేరు తీసి నాతలమీద పడేసింది. వెల్లకిల పడుక్కుని ఏదో మాట్లాడబోయింది. మొగముదగ్గిరికి వెళ్లాను. నాముఖము రెండు చేతులా తడివి గొణుగుతోంది. ఇంకా దగ్గిరికి వెళ్లాను. నాముఖం తన చెక్కుల కదుముకుని "మళ్లీజన్మకి" అంది. సరి మరిలేదు. అంతా అంధకారం.

"ఈమె నా చెల్లెలా? భార్యా?"